కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :161 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | బుధవారం 14-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

ఎన్నికల్లో ఓడితే ఈసీదే బాధ్యతా? : కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ : కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ సంస్థలను వివాదాల్లోకి లాగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే ఎన్నికల సంఘం (ఈసీ), సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బాధ్యత వహించాలా? అంటూ ప్రశ్నించారు. ఎన్నికలసమాచారం చూడండి తమకు అనుకూలంగా నిర్ణయాలు రాకపోతే న్యాయవ్యవస్థపై విమర్శలు చేయడం తగదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తప్పుబట్టారు. భారత్ ఏమైనా సోనియా గాంధీ కుటుంబానికి చెందిన ప్రైవేటు ఆస్తా? అని ప్రశ్నించిన కిషన్‌రెడ్డి, ప్రజాస్వామ్య వ్యవస్థల స్వతంత్రతను గౌరవించాలని కాంగ్రెస్‌కు సూచించారు.

రోడ్ల పేరిట రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు లాక్కుంటున్నారు



హైదరాబాద్:మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 2,000 ఎకరాల భూములు ప్రభుత్వం లాక్కుంది. అసలు ఎందుకు భూములు తీసుకుంటున్నారు..? ఈ భూదాహం ఏంటని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్ లో ఆమె మీడియాతో మాట్లాడారు.దేని కోసం తీసుకుంటున్నారో చెప్పకుండా రైతులను ఎందుకు రోడ్డున పడేస్తున్నారు రేవంత్ రెడ్డి?రోడ్ల పేరిట రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు లాక్కుంటున్నారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్కు.. అలాగే మహేశ్వరం నియోజకవర్గంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేస్తున్నారు. ఆల్రెడీ రోడ్డు మార్గాలు ఉండగా.. మళ్లీ భూములు లాక్కొని కొత్తగా రోడ్లు వేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు.అవసరం లేకున్నా.. తమ వ్యక్తిగత స్వార్థం కోసం రోడ్లు వేస్తున్నారే తప్ప.. ప్రజలకు ఉపయోగం లేదని అన్నారు.బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఖరారు కాలేదు.. భూసేకరణ చేయమని రాష్ట్ర ప్రభుత్వానికి మేం చెప్పలేదని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఒకవేళ వాళ్లు బుల్లెట్ ట్రైన్ పేరిట భూసేకరణ చేస్తుంటే.. అది ఇల్లీగల్ అని కేంద్రమంత్రి స్పష్టం చేశారని గుర్తు చేసారు.మరి.. బహదూర్గూడ రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, రాత్రికి రాత్రి ఫెన్సింగ్ వేసిన రేవంత్ ప్రభుత్వం దీనికి ఏం సమాధానం చెప్పింది? అసలు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఖరారు కానప్పుడు.. ఏ ఉద్దేశంతో బహదూర్గూడ భూములు తీసుకున్నారు? బుల్లెట్ ట్రైన్ ఎక్కడ వస్తుందో కేంద్ర ప్రభుత్వానికే తెలియనప్పుడు.. రేవంత్ ప్రభుత్వం రాష్ట్ర రైతులను ఎందుకు భయపెట్టిస్తున్నారని అమె నిలదీసారు.

త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా: విజయసాయిరెడ్డి



అమరావతి: రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నానని వైసిపి మాజీ ఎంపి విజయసాయిరెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి నాయకులను తయారు చేస్తానని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తనది బాల్ ఠాక్రే పాత్ర అని వ్యాఖ్యానించారు. మరోసారి చెబుతున్నా.. అధికారం జెన్ జీదేనని తన పార్టీకి సంబంధించిన పేరు, జెండా, అజెండా సిద్ధమవుతున్నా యని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. వాటిని త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. ప్రస్తుతం ఆయుర్వేద చికిత్స కోసం కేరళకు వెళ్తున్నానని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కొత్త పార్టీ ఆవిర్భావ తేదీని ప్రకటిస్తానని

జంతర్ మంతర్ వద్ద నిరసనలపై ఆంక్షలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్



న్యూఢిల్లీ,ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలపై విధించిన ఆంక్షలను, ప్రజా ప్రదర్శనల కోసం ప్రత్యామ్నాయ ప్రదేశాలను నిర్దేశించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. అక్టోబర్ 11న ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ జారీ చేసిన స్టాండింగ్ ఆర్డర్, జంతర్ మంతర్‌ను డీ-నోటిఫై చేసి, తూర్పు ఢిల్లీలోని రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్ మరియు సీబీడీ గ్రౌండ్‌లను నిరసనలు, ప్రదర్శనల కోసం కొత్త వేదికలుగా నిర్దేశించింది. ఈ మూడు వేదికల వద్ద నిరసనల కోసం వివరణాత్మకమైన మరియు సవరించిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని విడిగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తమ ఉత్తర్వులో పేర్కొన్నారు. జాతీయ రాజధానిలో నిర్దేశించిన నిరసన వేదికల లభ్యత మరియు అనుకూలతపై ఈ పిటిషన్ ఆందోళనలను లేవనెత్తింది.

నిరసన ప్రదేశాలపై కూడా పిటిషన్ ఆందోళన వ్యక్తం

నిరసనల కోసం జంతర్ మంతర్‌ను నిర్దేశిత ప్రదేశంగా సుప్రీంకోర్టు గతంలోనే గుర్తించిందని, రామ్‌లీలా మైదాన్‌ను అనుచితమైన ప్రత్యామ్నాయంగా తిరస్కరించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆంక్షల వెనుక ఉన్న హేతుబద్ధతను, ప్రదర్శనల కోసం ఇతర ప్రదేశాలను ఎంపిక చేయడాన్ని ఈ పిటిషన్ ప్రశ్నించింది. ప్రతిపాదిత ప్రత్యామ్నాయ నిరసన ప్రదేశాలపై కూడా పిటిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. వాటిలో కొన్ని ఢిల్లీలోని చెత్త డంపింగ్ ప్రాంతాల సమీపంలో ఉన్నాయని, బహిరంగ సభలు నిర్వహించడానికి అవి అనువైనవా కాదా అని ప్రశ్నించింది. పిటిషనర్ తరపు న్యాయ బృందానికి ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ముక్తా గుప్తా నాయకత్వం వహించే అవకాశం ఉంది.

యాసంగి పంటలపై ప్రభుత్వం కీలక ప్రకటన



ఖమ్మం:తెలంగాణ రాష్ట్రాన్ని ఎల్ నినో గండం ముంచెత్తుతోంది. రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటితోపాటు విద్యుత్ సరఫరాపై కూడా తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతాంగం యాసంగి సాగు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను ఎలాగోలా కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని.. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే తీవ్ర నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని.. ఈసారి యాసంగి పంటలు వేయకుండా రైతులు సహకరించాలని కోరారు.ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో మంత్రులు పర్యటించారు. అనంతరం ఎల్ నినో పరిస్థితులపై చర్చించారు. రానున్న రోజుల్లో వర్షాలు ఆశించిన మేర కూరిసే అవకాశం ఉండకపోవచ్చన్నారు. వ్యవసాయానికి అవసరమైన నీటితోపాటు ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు సాధ్యమైనంత వరకు నీటిని అందించి వాటిని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. రెండో పంట వేసి ఆ తర్వాత నీరు అందక పంటలు ఎండిపోయినట్లయితే.. రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రులు హెచ్చరించారు. అందువల్ల పరిస్థితులను అర్థం చేసుకుని యాసంగి సాగు విషయంలో ప్రభుత్వం సూచనలను పాటించాలని రైతులను కోరారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతమేర తగ్గించే అవకాశం ఉందని తెలిపారు.నీటి లభ్యతపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతే, అది తాగునీటి సరఫరాతో పాటు సాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. పంటలు వేసే ముందు నీటి లభ్యతను అంచనా వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ముందుగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆయన అన్నారు. వర్షపాతం లేకపోవడంతో పాటు, విద్యుత్ సరఫరాలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. బయటి మార్కెట్ నుండి నిత్యావసర విద్యుత్‌ను కొనుగోలు చేయడం రోజురోజుకు భారీదైనదిగా మారుతోందని ఆయన అన్నారు. యూనిట్‌కు రూ. 15 చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రజలకు విద్యుత్ లభించని పరిస్థితులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రజలు అవసరమైనంత మాత్రమే విద్యుత్‌ను వాడుకుని డబ్బు ఆదా చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలను కవర్ చేస్తూ ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని పేర్కొంటూ, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలలో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. పంట కోత పూర్తయ్యే వరకు నీటి కొరతను నివారించడానికి, ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా చూసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక వార్ రూమ్ మరియు టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడంపై కూడా దృష్టి సారించింది. కరువును ఎదుర్కొంటున్న జిల్లాలకు సహాయం అందించడానికి మరియు కరువు నివారణ చర్యలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అభ్యర్థించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత 125 పనిదినాలకు అదనంగా, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మరో 50 రోజుల పనిని అభ్యర్థించే విషయాన్ని కూడా పరిశీలిస్తోంది.ఎల్ నినో ప్రభావం, కరువు పరిస్థితి, రైతుల సమస్యలు, తాగునీరు మరియు సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరాపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో త్వరలో ఒక ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాబోయే నెలల్లో ప్రభుత్వ పనితీరుకు మార్గదర్శకంగా ఉంటాయి.

గుడ్ న్యూస్.. త్వరలో సింగరేణి కార్మికులకు సొంతిల్లు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, సింగరేణిలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్నాయని కొన్ని అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. పెండింగ్?లో ఉన్న 300 కారుణ్య నియామకాలు 15 రోజుల్లో పూర్తి చేస్తామని అలాగే అలియాస్ పేర్ల అంశానికి సంబంధించి 15 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని తెలిపారు. ఇవాళ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రజాభవన్ లో మీడియాతో ఆయన మాట్లా?డారు. ఇక నుంచి సింగరేణి కార్మికులకు మెడికల్ ఇన్ వాలిడేషన్ ఆయా ఏరియా ఆసుపత్రిలోనే జరుగుతుందన్నారు.

'నెహ్రూ కాలనీల' పేరుతో క్వార్టర్ల నిర్మాణం:

కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు 'నెహ్రూ కాలనీల' పేరుతో క్వార్టర్ల నిర్మాణం, ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి మించి ఆధునీకరించి అత్యుత్తమ వైద్య సదుపాయాల కల్పనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని భట్టి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో దసరా బోనస్ 34 శాతం ప్రకటించిన డిప్యూటీ సీఎం.. సింగరేణికి రూ.1,754 కోట్ల మేర లాభాలు వచ్చాయని, ఒక్కో ఉద్యోగికి రూ. 1,53,912 వస్తుందన్నారు. సింగరేణి శాశ్వత కార్మికులుగా 38 వేల మంది ఉన్నారని మరో 30 వేల మంది కాంట్రాక్ట్ వర్కర్లు ఉన్నాన్నారని చెప్పారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్?కురూ. 5,500 బోనస్ ఇస్తామన్నారు.

ఎల్బీనగర్ - హయత్ నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం..

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో తెలంగాణలో కీలకమైన మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తులపై స్పందించిన కేంద్రమంత్రి పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలపడమే కాకుండా, సానుకూలంగా స్పందించారు.

సమావేశంలో లభించిన కీలక ఆమోదాలు..

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు అత్యంత కీలకమైన ఎల్బీనగర్ - హయత్ నగర్ డబల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపన ప్రతిపాదనకు ఓకే చెప్పారు. NH 167ఖ పై ఈ బ్రిడ్జి నిర్మాణం ద్వారా తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అనుసంధానం పెరగడమే కాకుండా రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు పర్యాటక రంగం రూపురేఖలు మారనున్నాయి. హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ చీఎ 765 పై ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి.. తక్షణమే నూతన డీపీఆర్ సిద్ధం

గురుకులాల్లో పీఎంయూ టెండర్లను రద్దు చేయాలి : హరీశ్ రావు



హైదరాబాద్, రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి, ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల కడుపు కొడుతూ రూ. 800 కోట్ల టెండర్లలో భారీ కమీషన్ల దందా నడుపుతోందని ధ్వజమెత్తారు. గతంలో ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ సివిల్ సప్లైస్‌లో రూ. 65 కోట్ల డిపాజిట్ జప్తునకు గురై బ్లాక్‌లిస్టులో ఉన్న 'నాకాఫ్' సంస్థకు ఈ కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా 12 మందికి సబ్ కాంట్రాక్టులు ఇచ్చి, జిల్లాకు రూ. 2 కోట్ల చొప్పున రూ. 66 కోట్ల గుడ్‌విల్, బిల్లుల్లో ప్రతినెల 20 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టి మూడు నెలల్లోనే విఫలమై రద్దు చేసిన లోపభూయిష్టమైన విధానాన్ని తెలంగాణలో ఎవరి జేబులు నింపడానికి రుద్దుతున్నారని హరీశ్ రావు నిలదీశారు. స్థానిక వ్యాపారులు ఇచ్చే ధరల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరలకు కాంట్రాక్టు కట్టబెట్టినా, నేటికీ 4 వేల హాస్టళ్లకు సరిగ్గా సరుకులు సరఫరా చేయలేని చేతకానితనంలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి,పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణిస్తూ డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా పాత పద్ధతిలోనే స్థానిక వెండర్లకే నిత్యావసరాల సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. దీనివల్ల వేలాది చిరు వ్యాపార కుటుంబాల జీవనోపాధి దక్కడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, తాజా సరుకులు అందుతాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులు, వ్యాపారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



సంపాదకీయం

బుధవారం 14-10-2026

జ్ఞానేశ్ ఇష్యూలో కాక్రోచ్‌లకు కాంగ్రెస్ షాక్

కాక్రోచ్ జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌ను కాపాడుకునేందుకు రాహుల్ వేస్తున్న ఎత్తుగడలు ప్రస్తుతానికి తిరుగులేని ఫలితాలనిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ ఉద్యమం సందర్భంగా జంతర్ మంతర్ వద్ద బైఠాయించి, ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైన కాక్రోచ్ జనతా పార్టీ విపక్ష స్పేస్‌లో అప్పట్లో భారీ మైలేజీని కొల్లగొట్టింది. విద్యార్థి, యువజన ఉద్యమాలను తమ ఖాతాలో వేసుకుంటూ ఆ పార్టీ సృష్టించిన ప్రభంజనం కాంగ్రెస్ ఉనికికే సవాలుగా నిలిచింది. సరిగ్గా అదే అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న హస్తం పార్టీ అగ్రనాయకత్వం.. కేంద్ర ఎన్నికల సంఘం వివాదంలో ఆ తప్పు మళ్లీ జరగకూడదని పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాక్రోచ్‌లు మొదలుపెట్టిన నిరసన స్వరాన్ని కాంగ్రెస్ తెలివిగా తన అధీనంలోకి తీసుకుంది.ప్రస్తుతం జాతీయ మీడియాలోనూ, సోషల్ మీడియా ట్రెండ్స్‌లోనూ కేవలం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల గురించే చర్చ సాగుతోంది. ఆకాశవాణి భవన్ ఆవరణలో 9 గంటల పాటు చెట్టు కింద బైఠాయించడం, జంతర్ మంతర్ వద్ద ప్రియాంక గాంధీ నడిరోడ్డుపై పడుకుని నిరసన తెలపడం, రాహుల్ గాంధీ ఎఫ్‌ఐఆర్‌లు నా మెడల్స్ అంటూ దూకుడుగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం వంటి పరిణామాలు కాక్రోచ్ పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనలను పూర్తిగా నీరుగార్చాయి. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా.. రోజూ ఏపీలోని పార్లమెంట్ సభ్యుల నుంచి మొదలుకొని అగ్రనేతల వరకు ఎవరు ఎప్పుడు రోడ్డెక్కాలి, ఎక్కడ డిటెన్షన్ కావాలనే పక్కా డైలీ షెడ్యూల్‌ను కాంగ్రెస్ ముందే సిద్ధం చేసుకుని నడిపిస్తోంది. ఫలితంగా, ఉద్యమ పార్టీగా పేరున్న కాక్రోచ్‌ల నిరసనలకు మీడియాలో కనీస ప్రాధాన్యత కూడా దక్కని పరిస్థితి తలెత్తింది.ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహారంలో ఆ ఘనత మొత్తం కాక్రోచ్‌ల ఖాతాలోకి వెళ్లిపోవడంతో చేతులు కాలిన కాంగ్రెస్.. జ్ఞానేశ్ కుమార్ ఇష్యూలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీఈసీ రాజీనామా చేయడమో లేక కేంద్రం దిగిరావడమో జరిగితే.. ఆ విజయం కేవలం కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పోరాటం వల్లే సాధ్యమైందనే నేరేటివ్‌ను ప్రజల్లో బలంగా నాటడమే రాహుల్ టీమ్ అసలు లక్ష్యం. సీఈసీ అంశంపై తాము రోడ్లపైకి వచ్చి అరెస్టులు కావడం ద్వారా.. కాక్రోచ్ పార్టీని కేవలం అండర్‌గ్రౌండ్ కార్యకర్తల స్థాయికే పరిమితం చేసి, తామే అసలైన ప్రజాస్వామ్య పోరాట శక్తులమని దేశానికి చాటడంలో కాంగ్రెస్ వ్యూహం ముందడుగు వేసింది.ఈ ఆధిపత్య పోరులో కాక్రోచ్‌లు అంత సులభంగా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. అక్టోబర్ 10న జంతర్ మంతర్‌ను భారీ ఎత్తున ముట్టడిస్తామని వారు ఇప్పటికే గడువు విధించి, తమ శ్రేణులను ఢిల్లీకి తరలించే సన్నాహాల్లో ఉన్నారు. కానీ, ఆ ముట్టడి రోజున కూడా కాంగ్రెస్ ఊరికే కూర్చునే అవకాశం కనిపించడం లేదు. అప్పటికే పార్లమెంట్ సభ్యులు, కూటమి సీనియర్ నేతలతో కలిసి మరింత పెద్దఎత్తున ప్రత్యక్ష నిరసనలను హోరెత్తించి, కాక్రోచ్‌ల కార్యక్రమాన్ని పూర్తిగా హైజాక్ చేయడానికి కాంగ్రెస్ గ్రౌండ్‌వర్క్ సిద్ధం చేస్తోంది. బీజేపీతో నేరుగా తలపడటంతో పాటు.. విపక్ష స్థానాన్ని ఆక్రమించాలనుకుంటున్న కాక్రోచ్‌లను వెనక్కి నెట్టి, తనే ఏకైక ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవడమే కాంగ్రెస్ అసలు రాజకీయ పోరాటంగా మారిం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు ముఖ్య నేతలు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకాలను కోర్టు విడుదల చేసింది. శనివారం విమానం దిగగానే విమానాశ్రయం నుంచే వారిని ముందస్తుగా కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, ఆదివారం ఉదయం ఢిల్లీ క్యాంట్ మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఏడాది పాటు దేశంలో ఎలాంటి శాంతిభద్రతల విఘాతానికి లేదా శాంతిభంగానికి పాల్పడకూడదనే కఠిన షరతుపై రూ.50,000 ముందస్తు బెయిల్ బాండ్‌తో కోర్టు వారికి ఉపశమనం కల్పించింది.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సిజెపి ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని భావించినప్పటికీ, పోలీసులు విమానాశ్రయంలోనే దిప్కే బృందాన్ని అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. విమానం లోపలికే వచ్చి పోలీసులు తమను అరెస్టు చేస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దిప్కే, ఇది అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జనం గుమిగూడకుండా నగరవ్యాప్తంగా భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసిన ఢిల్లీ పోలీసులు, నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. శనివారం నాటి ఆందోళనల్లో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు సుమారు 3,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి వేళ విడుదల చేశారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా శనివారం రాత్రి పొద్దుపోయాక పోలీసులు విడుదల చేశారు.సిజెపి అగ్రనేతలు విడుదలైనప్పటికీ, ఢిల్లీ వ్యాప్తంగా ఇంకా పోలీసుల పహారా కొనసాగుతోంది. రాజధానిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి ముందుజాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని విమర్శిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు తమ పోరాటాన్ని చట్టబద్ధంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ట్రిపుల్ఐటీ కూడలిలో మూడు ఫ్లై ఓవర్లు.. రెండు డబుల్ డెక్కర్లు



హైదరాబాద్,తాజాగా ఎనిమిది జిల్లాల పరిధికి విస్తరించిన రాజధాని నగరంలో ప్రతిష్టను చాటేలా అనేక ప్రాజెక్టులను ఎంచుకున్న సర్కారు నిర్ధేశిత కార్యాచరణతో ఒక్కొక్కటిగా పూర్తి చేసేందుకు చర్యలు మొదలుపెట్టింది. అందులో భాగంగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థను ఆవిష్కరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్యూర్ చట్టం అమలులో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్ బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల ఏర్పాటు-ను వేగవంతం చేయాలని సూచించారు. నగర రవాణా, మౌలిక సదుపాయాలు, నీటి నిర్వహణను సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ అవసరాలకు సిద్ధమైన హైదరాబాద్‌ను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రజా ప్రభుత్వ ఎంచుకున్న ప్రాధాన్యతల్లో కీలకమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు మరో భారీ రహదారి ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది.గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ కూడలిని ఆధునిక రవాణా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ) రూ.459 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఒకే కూడలిలో మూడు ఫ్లై ఓవర్లు, ఒక అండర్‌పాస్ నిర్మిస్తుండటం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. వీటిలో రెండు డబుల్ డెక్కర్, 3 ఫ్లై ఓవర్లు కావడం విశేషం. నిర్మాణాలు పూర్తయితే ఐటీ కారిడార్‌లోని కీలక మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గడంతో పాటు- వాహనదారులకు ప్రయాణ సమయం ఆదా కానుంది.

ఒకే కూడలిలో బహుళస్థాయి రహదారులు

ట్రిపుల్ఐటీ- కూడలిలో భూమిపై సాధారణ రహదారులు, భూగర్భంలో అండర్‌పాస్, మొదటి స్థాయిలో ఫ్లై ఓవర్లు , దానిపైన మరో రెండు స్థాయుల్లో పైవంతెనలు అందుబాటు-లోకి రానున్నాయి. వివిధ దిశల్లో ప్రయాణించే వాహనాలకు ప్రత్యేక మార్గాలు కల్పించడం ద్వారా కూడలిపై ఆధారపడే ట్రాఫిక్‌ను తగ్గించనున్నారు. ముఖ్యంగా ఐఎస్‌బీ, డీఎల్ఎఫ్, గచ్చిబౌలి, లింగంపల్లి మార్గాల్లో వాహనాల రాకపోకలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఐఎస్‌బీ, డీఎల్ఎఫ్ రోడ్ల మధ్య ఇరువైపులా వాహనాలు ప్రయాణించేలా 720 మీటర్ల పొడవున నాలుగు లైన్ల ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన ఐదు పిల్లర్లను రెండు స్థాయిల్లో నిర్మాణాలను మోయగలిగేలా ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. మొదటి స్థాయి ఫ్లై ఓవర్లపై మరో రెండు వక్రాకారపు పైవంతెనలను నిర్మించనున్నారు.

రెండు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్లు

ఐఎస్‌బీ వైపు నుంచి గచ్చిబౌలి కూడలి వైపు వెళ్లే వాహనాల కోసం 1.2 కిలోమీటర్ల పొడవున మూడు లైన్ల పైవంతెన నిర్మించనున్నారు. అదేవిధంగా డీఎల్ఎఫ్ రోడ్డు నుంచి లింగంపల్లి వైపు వెళ్లే వాహనాల కోసం 948 మీటర్ల పొడవున మరో మూడు లైన్ల పైవంతెన అందుబాటులోకి రానుంది. ఈ రెండు మార్గాలను మొదటి స్థాయి ఫ్లై ఓవర్లు పిల్లర్లకు అనుసంధానిస్తూ నిర్మించడం వల్ల అదనపు భూసేకరణ అవసరం తగ్గనుంది. తద్వారా నిర్మాణ వ్యయాన్ని నియంత్రించడంతో పాటు అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చని ఇంజినీర్లు భావిస్తున్నారు. ఒకే కూడలిలో వివిధ స్థాయుల్లో రహదారులు అందుబాటులోకి రావడం వల్ల వాహనాలు ఒకదానికొకటి అడ్డుపడే పరిస్థితులు తగ్గనున్నాయి. ప్రస్తుతం రద్దీ సమయాల్లో కూడలిలో ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు ఈ నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

గచ్చిబౌలి-లింగంపల్లి మధ్య అండర్‌పాస్..

?లఫఓవర్లతో పాటు- గచ్చిబౌలి, లింగంపల్లి మధ్య వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు 520 మీటర్ల పొడవున ఆరు లైన్ల అండర్‌పాస్‌ను నిర్మిస్తున్నారు. దీంతో పైవంతెనలపై ప్రయాణించే వాహనాలతో సంబంధం లేకుండా మరో మార్గంలో రాకపోకలు సాగించే అవకాశం ఉంటు-ంది. మొత్తం మీద ఈ ప్రాజెక్టులో భాగంగా 3.39 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచే సమయం తగ్గి, ప్రయాణికులకు సుమారు 10 నుంచి 15 నిమిషాల వరకు సమయం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం కార్యాలయాల రాకపోకల సమయంలో ఈ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, ఇతర వాహనదారులకు గణనీయమైన ఊరట లభించనుంది.

98 శాతం భూసేకరణ పూర్తి

ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణను అధికారులు వేగవంతం చేశారు. ట్రిపుల్ఐటీ- కూడలికి సంబంధించి సుమారు 98 శాతం ఆస్తుల సేకరణ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియతో పాటు- కూల్చివేత పనులు కొనసాగుతున్నాయని సీసీపీ వెంకన్న తెలిపారు. గచ్చిబౌలి కూడలి నుంచి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వరకు 21 ఆస్తులను సేకరించినట్లు- వివరించారు. భూసేకరణలో కీలక దశ పూర్తికావడంతో నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటు-న్నారు. ఈ ప్రాజెక్టును 2027 మే నాటికి అందుబాటు-లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టు-కున్నారు.

బయోడైవర్సిటీ-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు అభివృద్ధి

సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం సుమారు రూ.2 వేల కోట్ల విలువైన రహదారి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కమిషనర్ జి.సృజన తెలిపారు.

ఐటీ ఉద్యోగులకు పాడ్ ట్యాక్సీ సదుపాయం..

హైదరాబాద్, హైదరాబాద్‌లో ప్రయాణికుల రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చేందుకు తెలంగాణ సర్కార్ కీలక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మెట్రో రైలు దిగిన ప్రయాణికులు స్టేషన్ నుంచి బయటకు రాకుండానే డ్రైవర్ అవసరం లేని 'పాడ్ ట్యాక్సీ'లోకి మారి నేరుగా తమ కార్యాలయాలకు చేరుకునేలా కొత్త రవాణా వ్యవస్థను ప్రతిపాదించింది.ఐటీ కారిడార్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, సచివాలయం పరిసరాలను అనుసంధానిస్తూ మొత్తం 40.82 కిలోమీటర్ల మేర పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీనికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదికను హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. ప్రాజెక్టు కోసం లీ అసోసియేట్స్ సంస్థ మూడు నెలల పాటు అధ్యయనం చేసింది. తొలుత 44.62 కిలోమీటర్లు, 56.88 కిలోమీటర్ల నెట్‌వర్క్ ప్రతిపాదనలను పరిశీలించి, వాటి ఆధారంగా 40.82 కిలోమీటర్ల హైబ్రిడ్ నెట్‌వర్క్‌ను అనుకూలంగా సూచించినట్లు నివేదికలో పేర్కొన్నారు.ఇందులో కూకట్‌పల్లి?రాయదుర్గం మార్గంలో 7.62 కిలోమీటర్లు, రాయదుర్గం?నాలెడ్జ్ సిటీ మార్గంలో 12.83 కిలోమీటర్లు, రాయదుర్గం/హైటెక్ సిటీ?ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గంలో 14.01 కిలోమీటర్లు, సచివాలయం?ఎన్టీఆర్ మార్గ్ కారిడార్‌లో 6.36 కిలోమీటర్ల మేర నెట్‌వర్క్ ఉండనుంది. ఈ మార్గాల ద్వారా ఐటీ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులకు చివరి దశ రవాణా సదుపాయం కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం.ఈ పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌ను దశలవారీగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి 34.66 కిలోమీటర్లు, 2040 నాటికి 39.36 కిలోమీటర్లు, 2050 నాటికి పూర్తి నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. ఈ వ్యవస్థ ద్వారా రోజువారీ ప్రయాణికుల సంఖ్య 2030లో 5.42 లక్షలు, 2040లో 15.47 లక్షలు, 2050 నాటికి 20.31 లక్షలకు చేరవచ్చని నివేదిక అంచనా వేసింది.ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలోని 69 కిలోమీటర్ల మార్గంలో రోజుకు సుమారు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి వస్తే మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణం మరింత సులభమయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో ముంబైలోని బాంద్రా?కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలోనూ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు.హైదరాబాద్ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం వ్యయం, ప్రయాణికుల టికెట్ ధరలు, నిర్మాణ పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేసే గడువు ఇంకా వెల్లడికాలేదు. ఇవి ఖరారైన తర్వాతే ప్రాజెక్టు అమలు తీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదిత నెట్‌వర్క్ కార్యరూపం దాల్చితే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం అందుబాటులోకి రావచ్చు.

ఎమ్మెల్యే బాలరాజు సెటిల్మెంట్

పోలవరం,పోలవరం జనసేన ఎమ్మెల్యే బాలరాజు సెటిల్మెంట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీరులో ఎలాంటి మార్పు రాలేదని, తాజాగా ఆయనపై ఇసుక మరియు మట్టి అక్రమ రవాణా సెటిల్‌మెంట్ల ఆరోపణలు రావడంతో పాటు దానికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు రావడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. విచారణ కోసం హై లెవెల్ కమిటీని నియమించారు. గతంలో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై అనేక ఆరోపణలు రావడంతో పవన్ కల్యాణ్ పిలిచి క్లాస్ పీకారు. తాను అమాయకుడినని, తనకు ఏ పాపం తెలియదని బాలరాజు పవన్ ముందే నటించే ప్రయత్నం చేశారు. అయితే పవర్ స్టార్‌అయిన పవన్ కల్యాణ్ హెచ్చరికలు జారీ చేసి బాలరాజును పంపేశారు. హీరో ముందే నటనలా? అంటూ సొంత పార్టీ నేతలే బుగ్గలు నొక్కుకున్నార... తాజాగా మరొక వీడియా వైరల్ అవుతుండటంతో ఆయన ఇక తప్పించుకునే వీలు లేకుండా పోయింది సెటిల్‌మెంట్ చేస్తూ లక్షల రూపాయలు పంచి పెడుతున్న బాలరాజు వైఖరిపై సొంత పార్టీ నేతలే ఈ వీడియో ను లీక్ చేసినట్లు అర్థమవుతుంది. ఆయన ఇంట్లో నింపాదిగా స్థానిక నాయకులతో కలసి టీ తాగుతూ సెటిల్ మెంట్ చేస్తున్న వీడియో ఎమ్మెల్యే పరిస్థితికి అద్దం పడుతుంది. స్థానిక నాయకుల మధ్య ఇసుక, మట్టి అక్రమ రవాణా పంపకాల గొడవలు వీధికెక్కగా, స్వయంగా ఎమ్మెల్యే బాలరాజు లక్షలాది రూపాయల 5 లక్షల నుండి రూ. 21 లక్షల వరకు డీలింగ్స్ గురించి మాట్లాడిన ఆడియోతో కూడిన వీడియో బయటపడింది. ఎవరెవరికి ఎంత ఇవ్వాలని బాలరాజు చెప్పడం కూడా వీడియోలో వినిపించడంతో పార్టీ పరువు పోలవరం ప్రవాహంలా ఆ ప్రాంతంలో పారినట్లయింది. చిర్రి బాలరాజు తాజా వీడియో బయటకు రావడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కమిటీని నియమించారు. ఎమ్మెల్యే వ్యవహారశైలిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు పార్టీ తరపున ఒక హైలెవెల్ కమిటీని కూడా నియమించారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు రాగా, తాజాగా వెలుగు చూసిన ఇసుక పంచాయితీ వీడియోలు జనసేన పార్టీకి తలనొప్పిగా మారాయి. చిర్రి బాలరాజు వరసగా ఇలా వివాదాల్లో చిక్కుకోవడం, ఆయనకు సొంత పార్టీ లోనే శత్రువులు ఎక్కువగా ఉండటంతో తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. బాలరాజు ఇప్పుడు ఏం వివరణ ఇచ్చుకుంటారో తెలియదు కానీ, ఆయనకు మాత్రం పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో మరోసారి టిక్కెట్ ఇవ్వరన్న అభిప్రాయం పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతుంది. ఇంత బహిరంగంగా దోపిడీ చేస్తున్న వ్యవహారాన్ని పవన్ కల్యాణ్ సీరియస్ గా తీసుకున్నారని, అయితే స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు ఉండకపోయినా.. భవిష్యత్ లో మాత్రం బాలరాజుకు రాజకీయంగా ఇబ్బందులు తప్పవంటున్నారు.

ఎమ్మెల్యే భార్య పెత్తనం

దీనికి తోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే భార్య ఒక పార్టీ నాయకుడిపై దాడి చేయించారన్న ఆరోపణలు రావడం, సీనియర్ నేతలను, జనసైనికులను పక్కనపెట్టి పెత్తనం చెలాయిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పవన్ తీవ్ర అసహనానికి గురయ్యారు. అడవితల్లి బాట పేరిట పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పవన్‌ను ఆగ్రహానికి గురిచేసింది. తాజాగా నియమించిన హైలెవల్ కమిటీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు.

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు.. పార్టీలకు కాదు.. పోరాట యోధులకే పట్టం!

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో ప్రజాభిప్రాయం మారుతోందా? పార్టీల బలాబలాల కంటే నాయకత్వం, పోరాట పటిమకే ప్రజలు ప్రాధాన్యమిస్తున్నారా? అధికారంలో ఉన్నవారికి అండగా నిలవడం కంటే తమ హక్కుల కోసం పోరాడే సంఘాల వైపు మొగ్గు చూపుతున్నారా? తాజాగా జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు ఈ ప్రశ్నలను మరోసారి తెరపైకి తెచ్చాయి. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత వంటి అంశాలే ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయన్న చర్చకు ఈ ఎన్నికలు ఊతమిచ్చాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ మద్దతుతో బరిలో నిలిచిన సంఘాల అంచనాలకు భిన్నంగా ఎర్రజెండా అనుబంధ సంఘం ముందంజలో నిలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

పార్టీల అండ కంటే పోరాటమే ముఖ్యం!

ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలను కేవలం ఒక సంస్థలో గుర్తింపు సంఘం ఎంపికకే పరిమితమైన పరిణామంగా చూడలేమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే సంఘాలకు ప్రాధాన్యం లభిస్తుందనే సంకేతాలు ఈ ఫలితాల్లో కనిపిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అధికార పార్టీ అండ, రాజకీయ పలుకుబడి ఉన్నంత మాత్రాన కార్మికుల మద్దతు దక్కుతుందనే నమ్మకం సరికాదని ఈ పరిణామాలు గుర్తుచేస్తున్నాయని అంటున్నారు.

పార్టీలకు అనుబంధంగా పనిచేసే సంఘాల కంటే తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే నాయకత్వానికే కార్మికులు ప్రాధాన్యమిచ్చారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ఒక ఉద్యోగ సంఘం ఎన్నికల ఫలితాన్ని రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయానికి పూర్తి ప్రాతినిధ్యంగా భావించలేమని, దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి మరిన్ని రాజకీయ పరిణామాలను పరిశీలించాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఎర్రజెండా విజయంతో కొత్త చర్చ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ డిపోల్లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) గణనీయమైన విజయాన్ని సాధించినట్లు అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. సుమారు 97 డిపోల్లో 77కు పైగా డిపోల్లో ఈయూ ఆధిక్యం సాధించినట్లు పేర్కొంటున్నారు. ఈ ఫలితాలు కార్మిక సంఘాల మధ్య పోటీని మించి రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.గుర్తింపు సంఘంగా నిలవాలన్న అధికార పార్టీ అనుబంధ యూనియన్ ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం కాంగ్రెస్‌కు రాజకీయంగా ఒక హెచ్చరికగా భావిస్తున్నారు. అదే సమయంలో గతంలో ఆర్టీసీ సంఘాల ఎన్నికల వ్యవస్థను రద్దు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయం కూడా తాజా పరిణామాల నేపథ్యంలో చర్చకు వస్తోంది. ఎన్నికలను పునరుద్ధరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా కార్మికుల తీర్పు ఒక సందేశాన్ని ఇచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారంతోనే ఓట్లు రావు!

అధికారంలో ఉన్న పార్టీకి ప్రభుత్వ యంత్రాంగంతో పాటు రాజకీయంగా అనుకూల పరిస్థితులు ఉండవచ్చు. అయినప్పటికీ, కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆ అనుకూలత ఓట్లుగా మారకపోవచ్చని ఈ ఎన్నికలు సూచిస్తున్నాయి. ఆర్థిక ప్రలోభాలు, రాజకీయ అండదండల కంటే తమ హక్కుల కోసం నిలబడే నాయకత్వానికే ప్రాధాన్యం ఇచ్చామన్న సంకేతాన్ని కార్మికులు పంపినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే డబ్బు పంపిణీ, ఓటుకు నగదు చెల్లింపులు జరిగినట్లు వస్తున్న ఆరోపణలను నిర్ధారించే అధికారిక ఆధారాలు అందుబాటులో లేనందున వాటిని వాస్తవాలుగా పరిగణించలేం. ఎన్నికల ఫలితాలను విశ్లేషించేటప్పుడు కార్మికుల సమస్యలు, సంఘాల పనితీరు, అభ్యర్థులపై విశ్వాసం వంటి అంశాలకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.



హామీల అమలుపై నిలదీత

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం వంటి హామీలు గతంలో రాజకీయ చర్చలో కీలకంగా నిలిచాయి. వాటి అమలుపై కార్మికుల్లో ఉన్న ఆశలు, సందేహాలు తాజా ఎన్నికల సందర్భంలో మరోసారి ప్రస్తావనకు వస్తున్నాయి. ప్రభుత్వ హామీల అమలులో జాప్యం జరిగితే ఉద్యోగుల విశ్వాసంపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోతే అధికార పార్టీకి అనుబంధం

పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి టీమ్స్

కొవ్వూరు,తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో పెద్దపులి సంచారం స్థానికంగా కలకలం సృష్టించింది. దేచర్ల సమీపంలోని క్వారీ వద్ద పెద్దపులి తిష్ట వేయడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆ క్వారీ వద్దే సేదతీరుతున్న పులిని ఎలాగైనా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పులిని బంధించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు.పులికి ఎలాంటి హాని కలగకుండా, అలాగే సిబ్బందికి ప్రమాదం జరగకుండా దాన్ని బంధించేందుకు అటవీ శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కొవ్వూరు ప్రాంతంలో పులి సంచారం దృష్ట్యా స్థానిక ప్రజలు, సమీప గ్రామాల రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.గోదావరి జిల్లాలో పెద్దపులి దోబూతులాడుతోంది. చాలా రోజులుగా అటవీ శాఖను ముప్పుతిప్పలు పెడుతున్న పులి.. ఇప్పుడు చాగల్లు అరటితోటల్లో సంచరిస్తోంది. కొన్నాళ్లుగా పాపికొండల అభయారణ్యంలో తిరిగిన పులి కొన్ని రోజుల కిందట సీతానగరం వద్ద గోదావరి నదిని దాటింది. దేవరపల్లి మీదుగా ఇప్పుడు డెల్టా ప్రాంతానికి వచ్చేయడంతో అటవీ అధికారుల్లో ఆందోళన పెరిగింది. పులిని సాధ్యమైనంత త్వరగా బంధించేందుకు పూణె నుంచి ప్రత్యేక టీమ్‌ను రప్పించారు.ఈ క్రమంలో శనివారం ఉదయం పులి చాగల్లు సమీపంలోని ఓ అరటితోటలో రైతులకు కనిపించింది. ఆ తర్వాత ఓ ప్యాక్టరీ సమీపంలో పులి సేదతీరుతున్నట్లు కెమెరాలకు చిక్కింద. పులి అనుసరిస్తున్న వ్యూహం అటవీశాఖ అధికారులను ఆశ్చర్యపరుస్తోంది. పగటిపూట కోకో తోటలు, వరి పొలాల్లో నక్కుతూ, చీకటి పడగానే ఊర్లు మారుతూ హడలెత్తిస్తోంది. పులి కదలికలను అటవీ శాఖ అధికారులు ఛాలెంజ్‌గా తీసుకుని.. రేడియో కాలర్ సిగ్నల్స్, ప్రత్యేక డ్రోన్ కెమెరాల ద్వారా దాని జాడను ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ధీల్లీ నుంచి ప్రత్యేక మత్తు ఇంజెక్షన్ నిపుణుల బృందం కూడా పులిని బంధించే ఆపరేషన్‌లోకి దిగింది. పూణె టీమ్ మాత్రం సాధ్యమైనంత త్వరగా పులిని పట్టుకుంటామని చెప్పి ఒకరోజు పూర్తయిందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ

అమరావతి, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేబినెట్ భేటీలో బీసీలకు రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపులపై కీలకంగా చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం కానుందని తెలుస్తోంది. ఈ నెల 14 లేదా 15న ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 3 దశలలో నవంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ భేటీ ముగిసిన తరువాత మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలన వచ్చేలా చూద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 100శాతం గెలవాలని ఆకాంక్షించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని, చురుకుగా వ్యవహరిస్తూ వారి విజయం సాధించేలా చూసుకోవాలని సూచించారు. ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ, వారి రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెడికేటెడ్ బీసీ కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్) సమర్పించిన నివేదిక, సిఫార్సులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కొత్త నిర్ణయం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు లభించే స్థానాలు పెరగనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో కేవలం 33 వేల మంది బీసీలకు మాత్రమే అవకాశాలు దక్కగా, ప్రస్తుత నిర్ణయంతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో దాదాపు 38 వేల మందికి పైగా బీసీ ప్రజాప్రతినిధులకు పదవులు దక్కనున్నాయి. బీసీలకు గతంలో కంటే సుమారు 4 వేలకు పైగా స్థానాలు రగనున్నాయి.జిల్లాలు, వార్డులు, డివిజన్ల పునర్విభజనతో పాటు పెంపును పరిగణనలోకి తీసుకుని, జనాభా ప్రాతిపదికన ఈ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు మినహా ఇతర అన్ని విభాగాల పరిధిలోని దాదాపు 1.40 లక్షలకు పైగా స్థానాల్లో బీసీ రిజర్వేషన్లను వర్తింపజేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. స్థానిక చట్టాలు, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండానే బీసీలకు గరిష్ట స్థానాల్లో పోటీ చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. అంతేకాకుండా, సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించకుండా డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. దీని ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా పక్కాగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఏవైనా కేటగిరీలలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం కంటే తక్కువగా ఉంటే, కూటమి పార్టీల తరపున ఆయా పదవులను బీసీలకే కేటాయిస్తామని చంద్రబాబు ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ

పెద్దపల్లి,యువత శారీరక దృఢత్వాన్ని అలవర్చుకుని క్రీడలతో పాటు కెరీర్‌లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష పిలుపునిచ్చా రు. జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ వాతావరణం నెలకొందని, ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమ నేత సత్యనారాయణ రెడ్డితో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దానరి ఉష మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు నిరంతరం సేవలందించాలన్నా, జీవితంలో సాధించాలన్నా శారీరక దారుఢ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గత ఎన్నికల ప్రచార ఒత్తిడి వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు, నొప్పులు రావడంతో రెండు నెలల పాటు బెడ్‌రెస్ట్ తీసుకోవాల్సి వచ్చిందని,ఆ అనుభవంతోనే యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై చైతన్యం తేవడానికి ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ని దాదాపు 54 గ్రామాల్లో యువతతో కలిసి మార్నింగ్ వాక్, రన్నింగ్ కార్యక్రమాలు చేపట్టామని, ఆ సంకల్పంతోనే నేడు విజయవంతంగా 5 కిలోమీటర్ల పరుగును పూర్తి చేశామన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పడి నేటికి పదేండ్లు పూర్తయిన శుభవేళ జిల్లా సాధించిన ప్రగతిని గుర్తుచేస్తూ,ఈ పదేండ్ల కాలంలో మాతా–శిశు సంరక్షణ ఆసుపత్రి, సమీకృత కలెక్టరేట్, మినీ ట్యాంక్ బండ్, గ్రామాల్లో అంతర్గత రహదారులు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి అద్భుతమైన మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని,ధూళికట్ట బౌద్ధ స్తూపం, సబితం జలపాతం, రామగుండం,కాల్వ శ్రీరాంపూర్ వంటి ప్రకృతి రమణీయమైన పర్యాటక ప్రాంతాలు జిల్లా సొంతమని హర్షం వ్యక్తం చేశారు.స్థానిక యువతకు అత్యుత్తమ ప్రతిభ ఉందని,గతంలో నిర్వహించిన దేటా సైన్స్ శిక్షణ ద్వారా దాదాపు 120

రాజమండ్రి మేయర్ సీటుకు ఫుల్ డిమాండ్



రాజమండ్రి :రాజమండ్రి మేయర్ సీటు ఇపుడు కూటమిలోని అన్ని పార్టీలకు హాట్ ఫేవరేట్ గా మారుతోంది. ఇది పక్కాగా గెలిచే సీటు. దాంతోనే కూటమిలో టీడీపీతో పాటుగా జనసేన బీజేపీ ఈ సీటు మీద ఫుల్ ఫోకస్ పెట్టేశాయి. రాజమండ్రీ మేయర్ అంటే ఆ రాజసం ఆ లెక్క వేరబ్బా అనుకుంటూ మూడు పార్టీలలోని ఆశావహులు అంతా ఆరాటపడుతున్నారు. రాజమండ్రి సీటుకు ఉన్న సక్సెస్ ట్రాక్ రికార్డు ఆశావహులనే కాదు రాజకీయ పార్టీలను ఈ సీటు వైపు లాగేస్తోంది. ఎక్కడైనా తేడా కొడితే కొట్టొచ్చు కానీ రాజమండ్రి మాత్రం అసలు అలాంటిది ఉండదు, ఇక్కడ టీడీపీ బలంగా ఉండడంతో గతంలో అనేక ఎన్నికలలో గెలిచి సత్తా చాటింది. ఈ సీటుకు ఫలానా పార్టీ అభ్యర్థి అని కూటమి నుంచి ప్రకటించడమే లాంచనం. మేయర్ అయిపోయినట్లే అన్నంత గ్యారంటీ ఇచ్చే గెలుపు సీటు ఇది. అందుకే ఈ సీటు అంటే అంత వలపు పార్టీలకు అంటున్నారు.

గతంలో గెలిచింది వీరే :

ఇదిలా ఉంటే రాజమండ్రి మేయర్ సీటుకు గతంలో గెలిచిన పార్టీల హిస్టరీ చూస్తే ఎక్కువ సార్లు టీడీపీనే కనిపిస్తుంది. ఇక్కడ తెలుగుదేశం ప్రభావం అధికంగా ఉంటుంది. ఆ పార్టీ రాజకీయంగా బలంగా ఉండడమే కాదు ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లో అయినా రాజమండ్రి అంటే సైకిలెక్కేయాల్సిందే అన్నంత సెంటిమెంట్ ఉంది. ఆ సక్సెస్ స్టోరీ చూస్తే కనుక చాలానే ఉంది. 1994లో రాజమండ్రి మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసినప్పటి నుండి ఇక్కడ జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ స్పష్టమైన ఆధిక్యతను కనబరిచింది అన్నది చరిత్ర గుర్తు చేస్తోంది. ఇక 1994లో రాజమండ్రి కార్పొరేషన్‌గా మారిన తర్వాత మొదటి మేయర్‌గా మాతురి శ్రీనివాస చక్రవర్తి ఎన్నికయ్యారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలు మేయర్ పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ మొత్తంగా చూసినపుడు ఓవరాల్‌గా నగర పరిధిలోని డివిజన్లలో మేయర్ స్థానాల్లో టీడీపీ అత్యధిక సార్లు స్పష్టమైన గెలుపు రికార్డులను నమోదు చేసింది.

టీడీపీ బిగ్ సౌండ్ :

టీడీపీకి ఇక్కడ పక్కాగా గెలుపు ఉంటుంది. ఇక రాజమండ్రి కార్పొరేషన్ కి చివరిగా జరిగిన ఎన్నికలు 2014లో అయితే ఆ కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం మొత్తం 50 వార్డులకు గాను టీడీపీ ఏకంగా 34 స్థానాలను కైవసం చేసుకుని భారీ మెజారిటీతో మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. ఆ ఎన్నికల్లో వైసీపీ కేవలం 8 స్థానాలకే పరిమితమైంది. ఇక్కడ కేవలం మేయర్ పీఠమే కాకుండా రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రను పరిశీలించినా కూడా ఇక్కడ టీడీపీ అభ్యర్థులే వరసగా గెలుస్తూ వస్తున్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి భవాని, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ టీడీపీ నుంచి విజయం సాధిస్తూ వస్తున్నారు. దాంతో రాజమండ్రి అంటే కళ్ళు మూసుకుని టీడీపీ గెలిచే సీటుగా పొలిటికల్ హిస్టరీలో సెపరేట్ పేజీ ఉంది. ఈ కారణం వల్లనే రాజమండ్రి సీటు మీద మిత్ర పక్షాలు సైతం మోజు పడుతున్నాయి.

బీజేపీ సైతం :

ఈసారి జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిగా బరిలో ఉండబోతున్నాయి. దీంతో రాజమండ్రి మేయర్ సీటు ఎవరికి దక్కుతుందనే చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. పక్కాగా ఇది టీడీపీ సీటు. దాంతో తమ్ముళ్లు ఎక్కడా తగ్గేది లేదని అంటున్నారు. రాజమండ్రి కార్పొరేషన్ కి 2021లో ఎన్నికలు జరగకపోవడంతో టీడీపీలో ఆశావహుల సంఖ్య కూడా ఈసారి అధికంగా ఉంది. 2021లో రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పరిసర గ్రామాలను విలీనం చేయడంతో కోర్టు కేసులు పరిపాలనాపరమైన చిక్కుల కారణంగా అప్పట్లో ఎన్నికలు జరగలేదు. ఇపుడు అన్నీ క్లియర్ కావడంతో ఎన్నికలకు రంగం సిద్ధం చేశారు. దాంతో టీడీపీ నుంచి అనూహ్యమైన పోటీ నెలకొంది. మరో వైపు చూస్తే బీజేపీ కూడా రేసులోకి వస్తోంది. రాజమండ్రి ఎంపీ సీటులో బీజేపీ విజయం సాధించడంతో ఆ పరిధిలోని రాజమండ్రి మేయర్ కూడా తమకే కావాలని పట్టుపడుతోంది. ఇది గ్యారంటీగా గెలిచే సీటు కావడంతో కూడా కమలం ఆశలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి.

జనసేన రెడీ :

అంతే కాదు జనసేన నుంచి కూడా అనేక మంది ఈ సీటు మీద కన్నేశారు అని ప్రచారం సాగుతోంది. రాజమండ్రిలో జనసేన కూడా తమ పట్టుకుని పెంచుకునేందుకు ఈ సీటుని ఆశిస్తోంది. 2024 ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ సీటు కోసం జనసేన పట్టుబట్టి వెనక్కి తగ్గింది. అందువల్ల ఈసారి రాజమండ్రి మేయర్ సీటు ఇవ్వాలని కోరుతోందని అంటున్నారు. దీంతో రాజమండ్రి మేయర్ సీటు ఎవరికి అన్న చర్చ అయితే సాగుతోంది. ఎవరికి టికెట్ ఇచ్చినా మేయర్ గా పోటీ చేయాలీ అంటే కనీసంగా పాతిక లక్షల రూపాయలు అయినా ఖర్చు చేయగల సామర్థ్యం ఉండాలని అంటున్నారు. అంగబలం అర్థబలం దండీగా ఉన్న వారికే మేయర్ గా పోటీ చేసేందుకు ప్రధాన అర్హత అని తేలుతున్న

రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన.. బీఆర్ఎస్, బీజేపీ వ్యూహాలపై ఉత్కంఠ

హైదరాబాద్, తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు కీలకంగా మారనున్నాయి. అభ్యర్థుల ఎంపిక, పట్టభద్రుల ఓటరు నమోదు, సామాజిక సమీకరణాలు, యువత సమస్యలపై పార్టీల వైఖరి.. ఇవన్నీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలుగా కనిపిస్తున్నాయి. రాజకీయ పార్టీల బలాబలాల కంటే అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, గత పనితీరు, నిరుద్యోగులు--ఉద్యోగుల సమస్యలపై వారి పోరాటం కూడా ఓటర్ల నిర్ణయంలో కీలకం కానుంది. ఈ ఎన్నికల్లో పట్టభద్రులు ఎవరికి మద్దతు ఇస్తారన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ స్థానం నుంచి సామ రామ్మోహన్‌రెడ్డి, వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని బరిలోకి దింపాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. దీంతో మిగిలిన పార్టీల అభ్యర్థుల ఎంపికపై ఆసక్తి నెలకొంది.సామ రామ్మోహన్‌రెడ్డి గతంలో టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. సర్వోత్తమ్‌రెడ్డి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు. కాంగ్రెస్ ఈ రెండు స్థానాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా ప్రభుత్వ పనితీరును పట్టభద్రులకు వివరించడంతో పాటు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను ప్రచారంలోకి తీసుకెళ్లాలని భావిస్తోంది.

బీఆర్ఎస్ వ్యూహం ఏమిటి?

రెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ స్థానం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని మరోసారి బరిలోకి దింపే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.వరంగల్--ఖమ్మం--నల్గొండ స్థానం విషయంలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. గత ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న చేతిలో ఓటమి పాలైన ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవం, క్షేత్రస్థాయిలో పట్టభద్రులతో ఉన్న సంబంధాలు, పార్టీ శ్రేణుల మద్దతు వంటి అంశాలను బీఆర్ఎస్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

బీజేపీ అడుగులు ఎలా?

ఈ రెండు నియోజకవర్గాల్లో బలమైన పోటీ ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ స్థానం కోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, ఎన్‌వీ సుభాష్, గంగాపురం వెంకట్‌రెడ్డి తదితరుల పేర్లు చర్చకు వచ్చినట్లు సమాచారం. అయితే అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధికారిక ప్రకటన వెలువడే వరకు వీటిని పరిశీలనలో ఉన్న పేర్లుగానే చూడాలి.పట్టభద్రుల్లో తమకు ఉన్న మద్దతును పెంచుకోవడం, ఉద్యోగాలు, విద్యా రంగం, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ యోచిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా నిలవాలన్న వ్యూహంతో ముందుకు సాగితే పోటీ మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది.

సామాజిక సమీకరణాలపై చర్చ

కాంగ్రెస్ రెండు స్థానాలకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా బీసీ వర్గాల మద్దతు కోసం అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ఆసక్తి నెలకొంది. అయితే అభ్యర్థుల సామాజిక నేపథ్యమే ఫలితాలను నిర్ణయిస్తుందని చెప్పలేం. వారి పనితీరు, పట్టభద్రులతో సంబంధాలు, సమస్యలపై స్పందన, పార్టీల ప్రచార వ్యూహాలు కూడా కీలకంగా మారనున్నాయి.ఇతర పార్టీలు అభ్యర్థులను ప్రకటించిన తర్వాత సామాజిక సమీకరణాలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఆయా నియోజకవర్గాల



పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు ప్రచార బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. పట్టభద్రుల మద్దతును కూడగట్టేందుకు స్థానిక నాయకత్వం ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నది కూడా పార్టీలకు పరీక్షగా నిలవనుంది.

ఓటరు నమోదుపైనే ప్రధాన దృష్టి

రెండు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల కోసం కొత్తగా ఓటరు జాబితాలను రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 6 వరకు ఫారం–18 ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబర్ 25న ముసాయిదా జాబితాను, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. ఈ ఎన్నికలు 2027 మార్చిలో జరగనున్నాయి.ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేరున్న పట్టభద్రులు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరు జాబితాలో ఉండేలా చూడటంపై పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఓటరు నమోదులో ముందంజలో ఉండేందుకు కాంగ్రెస్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టగా, ఇతర పార్టీలు కూడా తమ మద్దతుదారులను నమోదు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఓటరు నమోదే ఎన్నికల తొలి కీలక దశగా మారింది. అర్హులైన పట్టభద్రులు నమోదు కాకపోతే పార్టీకి ఉన్న మద్దతు ఓట్ల రూపంలో ప్రతిఫలించకపోవచ్చు. అందుకే అభ్యర్థుల ప్రచారంతో పాటు ఓటరు నమోదు ప్రక్రియపై కూడా పార్టీలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉద్యోగాలు.. ఉపాధి.. విద్యే ప్రధాన ఎజెండా

పట్టభద్రుల ఎన్నికల్లో నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి? యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయా? ఉద్యోగ నియామక ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఏ పార్టీ ఎలాంటి చర్యలు తీసుకుంది? అనే అంశాలను పట్టభద్రులు పరిశీలించే అవకాశం ఉంది.అభ్యర్థులు కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితం కాకుండా పట్టభద్రుల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణను వెల్లడించాల్సి ఉంటుంది. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్నవారు, విద్యావేత్తల సమస్యలకు పరిష్కారాలు చూపగల నాయకత్వానికే మద్దతు లభిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీల భవితవ్యానికి పరీక్ష!

రెండు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలు రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయానికి పూర్తి ప్రాతినిధ్యం వహించకపోయినా, ప్రధాన రాజకీయ పార్టీలకు కీలక పరీక్షగా నిలవనున్నాయి. కాంగ్రెస్‌కు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టభద్రుల మద్దతు ఎలా ఉందో అంచనా వేసుకునే అవకాశం లభించనుంది. బీఆర్ఎస్ తన పునరుద్ధరణ వ్యూహాలను పరీక్షించుకోనుండగా, బీజేపీ తన ప్రభావాన్ని విస్తరించుకునేందుకు ప్రయత్నించనుంది.ఎన్నికల ఫలితాలు ఆయా పార్టీల రాజకీయ వ్యూహాలపై చర్చకు దారితీసే అవకాశం ఉంది. అయితే వాటిని రాష్ట్రవ్యాప్తంగా వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాలకు నేరుగా అన్వయించలేం. పట్టభద్రుల సమస్యలు, అభ్యర్థుల విశ్వసనీయత, పార్టీ ప్రచారం, ఓటరు నమోదు వంటి అంశాల సమ్మేళనమే ఈ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయనుంది.మొత్తంగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోరు ఇప్పుడే వేడెక్కుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి ఓటరు నమోదు వరకు ప్రతి దశ కీలకంగా మారుతోంది. పార్టీల అంచనాలు ఎలా ఉన్నా.. పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారన్నది తుది ఫలితాలే తేల్చనున్నాయి.

తెలుగు గంగ నీటిపై చర్చలు

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వస్తున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పర్యటన తెలుగు, తమిళ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రతిష్టాత్మక విజయవాడ ఉత్సవ్ 2.0 సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విజయ్ విచ్చేస్తున్నప్పటికీ.. ఈ పర్యటనకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విజయ్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సీఎం విజయ్ ముఖాముఖి భేటీ కానున్నారు.ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం తెలుగు గంగ నీటి పంపకాలు. చెన్నై నగర దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన చారిత్రక ఒప్పందం ప్రకారం తమిళనాడుకు సరైన కోటాలో కృష్ణా జలాలు అందడం లేదన్న అసంతృప్తి చెన్నై వర్గాల్లో బలంగా ఉంది. కండలేరు రిజర్వాయర్ నుంచి పూండికి చేరాల్సిన నీటి పరిమాణంలో ఏర్పడుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులు, కాల్వల నిర్వహణ, బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదిక కానుంది. తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం విజయ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరనుండగా.. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కాంక్షించే చంద్రబాబు సైతం దీనిపై సానుకూల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించే అవకాశముంది.నీటి సమస్యలతో పాటు ఈ భేటీకి అత్యంత బలమైన జాతీయ రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న వేళ.. ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయన్న భయం నెలకొంది. ఈ కీలక అంశంపై దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కేంద్రంతో సమన్వయం చేసేందుకు సీఎ

దాదాపు 1.42 లక్షల ఫ్లాట్లు...



హైదరాబాద్ ,వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒకవైపు రికార్డు స్థాయిలో కొత్త ప్రాజెక్టుల ప్రారంభం కొనసాగుతుండగానే, మరోవైపు అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య ఆందోళనకర స్థాయికి చేరుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డేటా అనాసిస్ సంస్థ క్రి మ్యాట్రిక్స్' విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, భాగ్యనగరంలో కొత్త ఫ్లాట్ల లాంచ్‌లు ఏకంగా 120 శాతం పెరిగినప్పటికీ? మార్కెట్లో దాదాపు 1.42 లక్షల ఫ్లాట్లు కొనుగోలుదారులు లేక అమ్ముడుపోకుండా మిగిలిపోయాయని సంచలన విషయాలు వెల్లడించింది.నగరంలో ముఖ్యంగా గచ్చిబౌలి, తెల్లాపూర్, కోకాపేట, ఇతర పశ్చిమ నగర పరిసరాల్లో లగ్జరీ, హై-రైజ్ ప్రాజెక్టులను బిల్డర్లు భారీగా మార్కెట్లోకి తీసుకొచ్చారు. అయితే, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు , ఐటీ రంగానికి చెందిన నియామకాల మందగమనం వల్ల ప్రాథమిక కొనుగోలుదారైన ఐటీ ఉద్యోగుల నుంచి కొనుగోలు వేగం ఆశించిన స్థాయిలో లేకపోవడమే ఈ ఇన్వెంటరీ పెరిగిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.ప్రాజెక్టులను వేగంగా ప్రారంభించడం, భూముల ధరలు అమాంతం పెరగడం వల్ల బిల్డర్లు సరఫరాను విపరీతంగా పెంచేసినప్పటికీ, దానికి తగినట్లుగా డిమాండ్ పుంజుకోకపోవడంతో ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ప్రాజెక్టులు నిర్మిస్తున్న డెవలపర్లపై ఆర్థిక భారంగా మారడంతో పాటు, భవిష్యత్తులో ధరల స్థిరీకరణకు లేదా కొత్త లాంచ్‌ల నెమ్మదించడానికీ దారితీసే అవకాశాలు ఉన్నాయి.అయితే, రాత్రికి రాత్రే ఇళ్లు అమ్ముడుపోకపోవడం వల్ల క్రమంగా మార్కెట్ కొనుగోలుదారుల అనుకూల మార్కెట్ గా మారే అవకాశం ఉందని మార్కెట్ రంగానికి చెందిన భావిస్తున్నారు. బిల్డర్లు నిల్వ ఉన్న ఇన్వెంటరీని వదిలించుకునేందుకు ప్రాజెక్టుల ధరలను స్థిరీకరించడం, సదలింపులు ఇవ్వడం లేదా నూతన ఆఫర్లు ప్రకటించడం ద్వారా రాబోయే రోజుల్లో కొనుగోలుదారులను ఆకర్షించేందుకు వ్యూహాలు మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. విపరీతంగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమై, అమ్ముడుపోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య భారీగా పేరుకుపోయిన ప్రాంతాల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టడం తీవ్ర రిస్క్‌తో కూడుకున్న పని. ఇన్వెంటరీ ఎక్కువగా ఉన్న ఏరియాల్లో డెవలపర్లు సేల్స్ కోసం ధరలను తగ్గించడమో లేదా నిలకడగా ఉంచడమో చేయాల్సి వస్తుంది. దీనివల్ల రీసేల్ మార్కెట్‌లో ప్రాపర్టీని అమ్మాలనుకున్నప్పుడు నరైన కొనుగోలుదారులు లభించక, ఆస్తి నామ్‌కేవాస్తేగా మిగిలిపోయి పెట్టుబడి లాక్ అయిపోయే ప్రమాదం ఉంది.దీనికి భిన్నంగా? కొత్త లాంచ్‌లు తక్కువగా ఉండి, కొనుగోలుదారుల డిమాండ్ నిరంతరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకోవడం ద్వారా వేగవంతమైన క్యాపిటల్ అప్రిషియేషన్ సాధించవచ్చు. ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న ఐటీ, కమర్షియల్ కారిడార్లు, మౌలిక వసతులు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో అబ్సార్ప్షన్ రేట్ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఆస్తులకు స్థిరమైన గిరాకీ ఉండటమే కాకుండా అద్దె ఆదాయం, అత్యవసర వేళల్లో రీసేల్ లిక్విడిటీ తక్షణమే లభిస్తాయి.అందుకే తెలివైన ఇన్వెస్టర్లు ప్రకటనలు, ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోకుండా? మార్కెట్ డేటా, ఇన్వెంటరీ నివేదికలను క్రమం తప్పకుండా విశ్లేషిస్తారు. మార్కెట్లో సరఫరా కన్నా డిమాండ్ బలంగా ఉన్న ఏరియాలను గుర్తించి పెట్టుబడి పెట్టడమే రియల్ ఎస్టేట్‌లో నష్టాల బారి నుండి కాపాడుకుంటూ సురక్షితమైన ఆర్థిక వృద్ధిని సాధించేందుకు మార్గం.

దీదీ...దయనీయమైన సంక్షోభం..



బెంగాల్, బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు ఎదురులేని శక్తిగా చక్రం తిప్పిన దీదీ మమతా బెనర్జీ నేడు తన రాజకీయ జీవితంలోనే అత్యంత దయనీయమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వామపక్షాల మూడు దశాబ్దాల కంచుకోటను బద్దలుకొట్టి తృణమూల్ కాంగ్రెస్ ని అధికారంలోకి తెచ్చిన నాటి దూకుడు, ఆమె సొంత పార్టీలోనే నిట్టనిలువునా చీలిక రావడంతో ఒక్కసారిగా ఆవిరైపోయింది. తిరుగుబాటు వర్గం మెజారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకుని అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాను దక్కించుకోవడమే కాకుండా, పార్టీ అసలు పేరు, చిహ్నంపై కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పైచేయి సాధించే దిశగా పావులు కదుపుతోంది. మెజారిటీ ప్రజాప్రతినిధులు రెబెల్ క్యాంప్ వైపు మొగ్గు చూపడంతో, మమత తన సొంత పార్టీతోనే పోరాడలేని అత్యంత బలహీనమైన స్థితికి దిగజారిపోయారు.ఈ రాజకీయ పతనానికి నిన్న మొన్నటి ఉపఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనంగా నిలిచాయి. కేంద్ర ఎన్నికల సంఘం పార్టీ గుర్తును స్తంభింపజేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసిన తర్వాత.. తన సొంత పేరునే పెట్టుకుని మమతా అల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరిట బరిలోకి దిగినప్పటికీ ప్రజలు ఆమెను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఒకప్పుడు బెంగాల్ రాజకీయాలను శాసించిన ప్రజా నాయకురాలి పార్టీకి నియోజకవర్గాల్లో కనీసం మూడు వేల ఓట్లు కూడా రాలేదంటే, క్షేత్రస్థాయిలో ఆమె ప్రజాదరణ ఎంతటి పాతాళానికి పడిపోయిందో స్పష్టమవుతోంది. కార్యకర్తల యంత్రాంగం తిరుగుబాటు వర్గం వెంటే నడవటం, సాధారణ ఓటర్లు సైతం మమత గ్రూపును ఏమాత్రం నమ్మకపోవడంతో ఆమె పార్టీ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారింది. సొంత నేతలే వెన్నుపోటు పొడిచారన్న సానుభూతి కూడా ప్రజల్లో కనీస ప్రభావం చూపలేకపోయింది.ఇకపై ఒంటరిగా పోరాడి పార్టీని నిలబెట్టుకోవడం మమతా బెనర్జీకి అసాధ్యమైన పనిగా మారింది. ఎంపీల్లో ఎక్కువ మంది ఇప్పటికే బీజేపీ వైపు , ప్రత్యేక కూటముల వైపు కదలడం, బెంగాల్ అసెంబ్లీలో రెబెల్ నేతలే కీలకంగా మారడంతో మమత గ్రూపు కేవలం ఒక చిన్నపాటి అసమ్మతి గ్రూపుగా మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో తన స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తే రాజకీయంగా పూర్తిగా కనుమరుగైపోవడం ఖాయం. అందువల్ల, గతంలో తృణమూల్ ఆవిర్భావానికి మూలమైన కాంగ్రెస్ పార్టీ వైపు మమత మళ్లీ చూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. తాను స్థాపించిన పార్టీ చీలిక వర్గం చేతుల్లోకి వెళ్లిపోవడాన్ని చూస్తూ కూర్చోవడం కంటే, మిగిలిన తన బలాన్ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడమే ఆమెకు మిగిలిన ఏకైక గౌరవప్రదమైన మార్గంగా కనిపిస్తోంది.కాంగ్రెస్‌లో విలీనం ద్వారానే మమత జాతీయ స్థాయిలో తన గుర్తింపును కొంతవరకైనా కాపాడుకునే అవకాశం దక్కుతుంది. రాష్ట్రంలో విస్తరిస్తున్న బీజేపీని, తిరుగుబాటు తృణమూల్ వర్గాన్ని ఏకకాలంలో ఢీకొట్టే సంస్థాగత బలం ప్రస్తుతం మమత వద్ద లేకపోవడంతో.. జాతీయ పార్టీ గొడుగు కింద చేరితేనే మనుగడ సాధ్యమవుతుంది. కాంగ్రెస్‌తో కలవడం వల్ల కనీసం బెంగాల్‌లో లౌకిక ఓటు బ్యాంకును కొంతవరకైనా ఏకం చేయగలగడమే కాకుండా, కేంద్ర స్థాయిలో విపక్షాల కూటమిలో బలమైన స్వరాన్ని కొనసాగించవచ్చునని భావిస్తున్నారు. మరి మమతా బెనర్జీ ఏం సాధిస్తారో ?

సన్న బియ్యం ఎగుమతికి తెలంగాణ ప్రణాళికలు

హైదరాబాద్ ,తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న మేలురకం సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలుదారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 'అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐదబ్ల్యుఆర్‌సీ) 2026'లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను స్పష్టం చేసింది.ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానించారు. కేవలం దేశీయంగా మిగులు నిల్వలను నిర్వహించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక విలువను సృష్టించడంపై దృష్టి సారించామని ఆయన వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు.గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న, మేలురకం బియ్యాన్ని బ్రాండెడ్, ట్రేసబుల్ (ఎక్కడ పండిందో గుర్తించే వీలున్న) పద్ధతిలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన అనుభవంతో ఈ కొత్త ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.ఒకవైపు ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు



సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 'సన్న బియ్యం' పీడీఎస్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్ నినో ప్రభావంపై ఆందోళనల కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గింది. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.80-82కి చేరింది. 25 కిలోల బస్తా ధర రూ.2,150 సమీపంలో పలుకుతోంది.ఇదే సమయంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో పోటీని తట్టుకోలేకపోతున్నామని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం నుంచి తక్కువ ధరకే బియ్యం అందుబాటులో ఉండటం మధ్యప్రాచ్యం, పశ్చిమాఫ్రికా మార్కెట్లలో భారత బియ్యంపై ప్రభావం చూపుతోందని వారు పేర్కొంటున్నారు.

ఈవీఎంల వల్లే జగన్ ఓడారు: తెలంగాణ మంత్రి

హైదరాబాద్,2024 ఎన్నికల ఫలితాలపై ఈవీఎంల పనితీరుపై వైసీపీ నేతలు కొందరు అనుమానాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈవీఎంల వల్లే జగన్ ఓడిపోయారని చాలామంది వైసీపీ నేతలు, అభిమానులు అనుమానం వ్యక్తం చేశారు. ఏదో జరిగిందని, కానీ, ఆధారాలు లేవని వైసీపీ అధినేత జగన్ కూడా నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత కొందరు ఈవీఎంల పనితీరుపై కోర్టులను కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలోనే 2024లో ఈవీఎంల వల్లే జగన్ ఓటమి పాలయ్యారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.అన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగన్ ఎలా ఓడిపోతారని కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడిందని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ 14 మీటింగులు పెడితే 10 మీటింగులలో ఆయన అభిప్రాయంతో మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు విభేదించారని గుర్తు చేశారు. ముగ్గురిలో ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకించారంటే అర్థం చేసుకోవాలని చెప్పారు. చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదని, కేంద్ర ఎన్నికల కమిషన్ లో పెద్ద కుట్ర జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు.రాబోయే ఎన్నికల్లో కూడా తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని, అందుకే 73 లక్షల ఓట్లు తొలగించాలని



కుట్ర పన్నుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుట్రలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అందుకోసం పోరాటం చేస్తామని, ఎంతవరకైనా వెళ్తామని కోమటిరెడ్డి చెప్పారు.

కరీంనగర్ ఉక్కిరిబిక్కిరి...



కరీంనగర్ :కరీంనగర్ దాదాపు నాలుగు లక్షల జనాభా ఉన్న కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో పీల్చుకునేందుకు స్వచ్ఛమైన గాలి దొరకడం లేదు. నగరంలోని మానేరు నది పక్కనే ఉన్న డంపింగ్ యార్డ్‌లో కాలుతున్న చెత్త కారణంగా వెలువడుతు న్న పొగతో పలువురు కేన్సర్, ఆస్తమాలతో ఇబ్బందులు పడుతున్నారు. 66 డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌లో ఏకంగా 22 డివిజన్ల పరిధిలో ప్రతీరోజూ ఊపి రి పీల్చుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

అసలేంటి సమస్య?

కరీంనగర్ నగరంలో 3,90,000 వరకు జనాభా ఉంది. నగరంలో డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ ప్రజలకు ప్రాణాంతకంగా మారింది. ప్రతీరోజూ బల్దియా 150 మెట్రిక్ టన్నుల మేరకు వ్యర్థాలు సేకరించి ఇక్కడే డంప్ చేస్తుంది. ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త మానేరు నదీ తీరాన పేరుకుపోయి గుట్టలను తలపిస్తోంది. ఇక్కడకు వచ్చిన చెత్తను బయోమైనింగ్ పేరిట ప్రాసెస్ చేస్తున్నారు. కానీ, ఆ చెత్తను కాల్చడం వల్ల 24 గంటలు వెలువడుతున్న పొగతో 07, 09, 10,11, 27, 30, 33, 34, 35, 36, 37, 38, 39, 40, 53, 57, 58, 41, 42, 65, 66వ డివిజన్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.డంపింగ్ యార్డుతో ప్రజలు ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ చెప్పారు. ఈ సమస్యపై అధ్యయనం చేసి రూ.17 కోట్ల స్వచ్ఛ్‌భారత్ నిధులతో టెండర్ల ప్రక్రియ ప్రారంభించామన్నారు.అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) నిధులతో రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ద్వారా శాశ్వత పరిష్కారానికి త్వరలో యాక్షన్ ప్లాన్ అమలు చేస్తామని తెలిపారు. అలకాపురికాలనీలో డంప్‌యార్డు పొగ సమస్య వల్ల దుంపేటి రాముతోపాటు మరో నలుగురు ఆక్సిజన్ సిలిండర్ల కోసం ఆర్డర్ పెట్టారు. కాలనీలో దాదాపు ఆరుగురు ఎయిర్ ప్యూరిఫయర్లు వాడుతున్నారు. అదే కాలనీలో నివసిస్తున్న పోలీస్, ఉపాధ్యాయ, ఇంజినీరింగ్ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఇళ్లల్లో పిల్లల కోసం ఎయిర్ ప్యూరీఫయర్లు కొనుగోలు చేస్తున్నారు.

ఆక్సిజన్ కొనాల్సి వస్తుంది..

రాత్రిపూట వెలువడుతున్న పొగ వల్ల ఊపిరి ఆడటం లేదు. చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏసీలు ఆపేయాల్సి వస్తుంది. నా పిల్లల కోసం రూ.800తో ఆక్సిజన్ సిలిండర్లు కొంటున్నా. ఇలా ఎంతకాలం కొనగలం.

-దుప్పేటి రాము, అలకాపురి కాలనీ, వ్యాపారి

ప్రతి నిమిషం పొగ తాగినట్టే...

డంప్ యార్డు నుంచి వచ్చే పొగ ప్రమాదకం. ఇది ఊపిరితిత్తుల రక్షణ కవచాన్ని దెబ్బతీస్తుంది. ఫలితంగా పిల్లల్లో ఆస్తమా, సీఓపీడీ వ్యాధులు వస్తాయి. వృద్ధులలో బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు మొదలవుతాయి. ఈ పొగ పీల్చడం ప్రతి నిమిషం సిగరేట్ తాగిన దానితో సమానం.

-డాక్టర్ సాయిని నరేందర్, పల్మనాలజిస్టు

కాకినాడ కార్పొరేషన్‌పై జనసేన కన్ను..

కాకినాడ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరిన వేళ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన మేయర్ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే వ్యూహంతో జనసేన పార్టీ అడుగులు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కూటమి సీట్ల సర్దుబాటులో జనసేన పార్టీ దక్కించుకోబోయే మున్సిపల్ కార్పొరేషన్లు, ముఖ్యంగా కాకినాడ వంటి కీలక మేయర్ స్థానాల్లో క్షేత్రస్థాయి బలాన్ని పెంచుకోవడంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వైపక్ష వైఎస్సార్సీపీని రాజకీయంగా దెబ్బకొట్టడమే కాకుండా, ఆ పార్టీలోని బలమైన సామాజిక వర్గాల నేతలను, ఆర్థికంగా అండదండలు ఉన్న నాయకులను తమవైపు తిప్పుకోవడంలో జనసేన సఫలీకృతమవుతోంది. క్షేత్రస్థాయిలో పట్టున్న వైసీపీ నేతలను వరుసగా పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా ప్రతిపక్షాన్ని కోలుకోలేని దెబ్బ తీసేలా జనసేన వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది.పెద్దాపురం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్సీపీకి పట్టున్న డివిజన్లు మరియు గ్రామాల్లోని ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇప్పుడు జనసేన వైపు మొగ్గు చూపుతోంది. జనసేన పోటీ చేయాలనుకుంటున్న కార్పొరేషన్ పరిధిలోని వార్డుల్లో గెలుపు గుర్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవడానికి ఈ వలసలు బాగా ఉపయోగపడనున్నాయి. క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలాన్ని భారీగా పెంచుకోవడం ద్వారా, కూటమి సీట్ల సర్దుబాటు చర్చల్లో ఎక్కువ వార్డులు మరియు మేయర్ స్థానాలను దక్కించుకోవచ్చనేది జనసేన అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది.అటు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రీజనల్ కోఆర్డినేటర్లతో భేటీ అయి మేయర్ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడగా.. ఇటు పవన్ కళ్యాణ్ ఆ పార్టీలోని కీలక నేతలను జనసేనలోకి లాగుతూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్సీపీకి గట్టి సవాల్ విసురుతున్నారు. రాబోయే రోజుల్లో గోదావరి జిల్లాల నుంచి మరికొంత మంది ప్రతిపక్ష నేతలు జనసేన బాట పట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

పవన్ కల్యాణ్ రాజకీయ శంఖారావం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ శంఖారావం పూరించారు. పోలవరం జిల్లాలో నిర్వహించిన అడవితల్లి బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పోరుకు శ్రేణులను సమాయత్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి విజయానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేనకు అనుకూలంగా



నినాదాలు చేస్తున్న వారిని వారించి కూటమి గురించి ప్రత్యేకంగాప్రస్తావించారు.సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమం కోసం జనసైనికులు ఎంతో త్యాగం చేశారని కొనియాడారు. ఎలాంటి పదవులూ ఆశించకుండా కేవలం కూటమి విజయమే ధ్యేయంగా పనిచేసిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. రాబోయే స్థానిక పోరులో కూడా అదే ఐక్యతను చాటాలని, కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసికట్టుగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికలు ముగిసిన తర్వాత ఇకపై కేవలం అభివృద్ధిపైనే పూర్తి దృష్టి సారించామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సినిమాల్లో రెండు గంటల్లో మార్పు వచ్చినట్లు నిజ జీవితంలో జరగదు. ప్రజాక్షేత్రంలో నిరంతరం కష్టపడి పనిచేయడమే ముఖ్యం అని జనసైనికులకు స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల పురోగతి కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని, ఏడు జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడి అపార అనుభవంతో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందని, స్థానిక పోరులో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.ఇదే సమయంలో పార్టీ అంతర్గత క్రమశిక్షణ, ప్రజాప్రతినిధుల ప్రవర్తనపై కూడా పవన్ పరోక్షంగా కఠిన సంకేతాలు ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు ప్రజలకు పారదర్శకంగా, అవినీతిరహితంగా సేవలందించాలని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతామని వెల్లడించారు.

మళ్లీ టూరిజంలోనే ఐఏఎస్ అమ్రపాలికి పోస్టింగ్!

అమరావతి,ఏపీ క్యాడర్‌లో అన్యమనస్కంగానే పని చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి అమ్రపాలికి ప్రభుత్వం మరోసారి టూరిజంలోనే పోస్టింగ్ కేటాయించింది. సుదీర్ఘ కాలం సెలవు పెట్టారు. సెలవు పూర్తయిన తర్వాత కూడా ఆమె రిపోర్ట్ చేయలేదు. దాంతో గతంలో ఆమెను పోస్టింగ్ లేని బదిలీ చేశారు. ఇప్పుడు తాను మళ్లీ విధుల్లో చేరుతానని విజ్ఞప్తి చేయడంతో పోస్టింగ్ కేటాయించారు.అమ్రపాలికి ఏపీ ప్రభుత్వంలోని పర్యాటక, సంస్కృతి శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇంతకు ముందు ఆమె ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పని చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం మళ్లీ ఆమెకు అదే టూరిజం రంగానికి సంబంధించిన శాఖలోనే కార్యదర్శి స్థాయి పదవిని కేటాయించింది. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఆధ్వర్యంలో ఆమె ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. రాష్ట్రంలో కొత్త టూరిజం ప్రాజెక్టులు, తీర ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ఆమె పని చేయనున్నారు.తెలంగాణ క్యాడర్ కు వెళ్లడానికి చాలా చాలా ప్రయత్నాలు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించారు. కానీ తాను తెలంగాణలోనే ఉంటానని..తన స్థానికత తెలంగాణ అని క్యాట్ నుంచి కోర్టు వరకూ



పోరాడారు. కానీ ప్రయోజనం లేకపోయింది. ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. దాంతో తప్పనిసరిగా ఏపీలో రిపోర్టు చేశారు. కానీ ఇంకా ఆమె తెలంగాణకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140